# గాలిమేడలు

శ్రీ "ఏకా"

శంకరయ్యగారిది బాగా బ్రతుకుచున్న సంసారం. కానీ, కాలం కలిసిరాలేదు. హటాత్తుగా భార్యా, రెండు సంవత్సరముల కుమారుడు రామూను, ఈ లోకమునవదలి స్వర్గస్థులయినారు. ఇక భార్య శారదమ్మగారికి కష్టకాలము దాపరించింది. ఆమె తన కుమారునికొరకే ఈ భూమిమీద బ్రతకవలసివచ్చెను. నా అనువారు లేకపోయిరి. ఎట్లయిననూ రామూను వృద్ధిలోనికి తెచ్చుటే ఆమె ఆశ. కుమారునకు అయిదు సంవత్సరములు రాగానే విద్యాభ్యాసమున ప్రవేశపెట్టెను. ఆమె గొప్ప, గొప్ప వారిండ్లలో మానాభిమానములన్నియూ వదలి, వంటలు చేయూచూ తన కుమారుని పోషించుకొనవలసివచ్చెను. రామూకూడా బడిలో శ్రద్ధగా చదువుకొనుచుండెను. ఆమెకు ఒక్కటే కోరిక. తను ఎన్ని కష్టములకయిననూ ఓర్చి కుమారుని వృద్ధిలోనికి తెచ్చుటయే ఆమె కోరిక,

రామూను ఒకటవ ఫారమందు ప్రవేశపెట్టెను. పాఠశాలకు ప్రతిదినమునూ వేళకుపోయి, ఇంటికివచ్చి బాగుగా చదువుకొనుచుండెను. ఇది అంతయూచూచి, తల్లి తన కష్టములన్నియూ మరచిపోయి ఆనందించుచుండెడిది. రామూ కూడా ఎల్లప్పుడునూ తల్లి మాటలకు ఎదురుచెప్పకుండా, నడుచుకొనుచుండెడివాడు. ఉదయముననే నిద్రలేచి ముందుగా తల్లి పాదములకు నమస్కరించి పాఠశాలకు వెళ్ళుచుండెడివాడు.

రామూ ఒకటవఫారం కృతార్థుడయినాడు. పాఠశాల అందరిలో మొదటివాడుగా కృతార్థుడయినాడు. మరుసటి సంవత్సరము రెండవఫారం చదువుచున్నాడు. పాఠశాలాధికారులు జీతం లేకుండా ఏర్పాటుచేసినారు.

నాల్గుసంవత్సరములు గడిచిపోయినవి. రాము స్కూలుఫైనలు ప్రభుత్వ పరీక్షలకు హాజరయినాడు. పరీక్షలు బాగానే వ్రాసానని తల్లికిచెప్పి ఆనందము కల్గించినాడు. శారదమ్మగారికి ఆనందమునకు మేరలేదు. ఆమె ప్రసాదరావుగారను ఒక లక్షాధికారి గారింటిలో వంట చేయుచూ కుమారుని వృద్ధిలోనికి తీసుకొనివచ్చినది. యజమానికిగూడా ఆమె, రామూ అన్న మంచి గౌరవము. ఆయన ఎప్పుడునూ "నీకొడుకుకేమమ్మా! మంచి అదృష్టవంతుడు" అని అంటూ ఉండేవారు. ఆయనకు ఒక్కతే కూతురు పేరు జానకి. రామూ, జానకీ ఒకటే క్లాసు, ఒకే సెక్షను. ఇద్దరునూ కలిసి చదువుకుంటూ ఉండేవారు. రామూయొక్క తెలివితేటలకు మెచ్చుకొని

ప్రసాదరావుగారు చాల ధనసహాయము కూడా చేసినారు. శారదమ్మగారుకూడా వారి ఇంట్లోనే ఉంటూ వచ్చారు.

పరీక్షా ఫలితాలు పత్రికలందు ప్రకటించారు. రామూ ప్రొద్దుననే బజారుకు పోయి దినపత్రిక తీసుకొని ఆనందముతో ఇంటికి తిరిగివచ్చాడు. తల్లిపాదములకు నమస్కరించాడు. తర్వాత పెద్దవారగు ప్రసాదరావుగారికి నమస్కారముచేసాడు. ఆయనగారు చాలా సంతోషించారు. కానీ, ఆయనకు ఒక్కటే విచారము. తన కుమార్తె జానకి మాత్రము కృతార్థురాలు కాలేదు. పాపం! జానకి తండ్రికి మొహము చూపించలేకపోయింది. జానకి తల్లి కుమార్తెను ఓదార్చింది. ఈ తడవ కాకపోయిన ఇంకొక తడవ చదువవచ్చని ఓదార్చింది. రెండు దినముల లో మార్కులుకూడా తెలిసినవి. రామూ, పరీక్షలకు హాజరయిన వారందరిలో ప్రథముడుగా కృతార్థుడయినాడు. ప్రభుత్వం రామూకు ఒక బంగారు పతకం బహూకరించారు. అది దినపత్రికలందు ప్రకటించబడింది. బంగారు పతకం పాఠశాలవారికి అందచేసారు. ఒకనాడు పాఠశాల ఆవరణలో బహిరంగ సమావేశము జరిపి రామూకు బంగారు పతకం బహూకరించారు. అందరున్నూ రామూయొక్క తెలివితేటలను పొగడారు. ఆ సమావేశమునకు ప్రసాదరావుగారే అధ్యక్షులు. వారు చివరకు మాట్లాడుచూ రామూ కాలేజి చదువు అయినంతవరకూ తానే ఖర్చంతయూ భరించెదనని చెప్పినారు. హర్షధ్వనులతో పాఠశాలంతయూ మారుమ్రోగింది. ఇది అంతయూ తల్లి శారదమ్మగారు చూడలేదుగాని, విని చాలా ఆనందించింది.

ఒకరోజు శారదమ్మగారిని ప్రసాదరావుగారు ఒంటరిగా పిలిచి రామూ చదువు విషయమై హెచ్చరించారు. "ఇంకా చదువెందుకు బాబూ! ఏదో మీ దయవల్ల ఇంతవాడయినాడు. మీరే నా కుమారునకు ఉద్యోగము ఇప్పించండి. మీ పేరు చెప్పుకొని బ్రతుకుతాము" అని శారదమ్మగారు అన్నారు.

"ఇదుగో! శారదమ్మగారూ! మీరు ఏమియూ అనుకోకుండాఉంటే నేనొక్కటి చెప్పుతాను. మీరు కాదనగూడదు."

"ఏమిటో చెప్పండి. ఇంతవరకూ మీ దయవల్లనే వృద్ధిలోనికి వచ్చాడు. మీరు ఇచ్చు సలహాలకు నేనెన్నడునూ కాదనను. చెప్పండి?"

"అయితే చెప్తాను వినండి. రామూ చాలా తెలివయినవాడు. వృద్ధిలోనికి రావలసినవాడు. నాకా కుమారులులేరు. ఒక్కతే ఒక్కకూతురు. మిమ్ములను ఈ వృత్తినుండి విరమింపచేయదలచుకున్నాను. అంటే, నేను మీ కుమారుని అల్లునిగా చేసికొనదలచాను. చిన్నప్పటినుండి నా

ఎదురుగానే పెరిగాడు. జానకికి గూడా రాముా అంటే చాలా ప్రాణం. రాముా, ఎంత చదువు చదువుకొన దలచిననూ, చెప్పించదలచుకున్నాను. జానకినిగూడా మరల స్కూలులో చదివించదలచాను. ఏదో! ఆ స్కూలు ఫైనలు దాటుతే చాలు. కాని! ఒక్కమాట. ఈ విష యము మన ఇద్దరిలోనే ఉండవలయును. చదువంతయూ పూర్తిఅయి, వివాహము జరుపబోవు వరకున్నూ ఎవ్వరికీ, తెలియ నీయకండి'' అన్నారు ప్రసాదరావుగారు.

ఈ మాటలన్నియూ శారదమ్మగారు వినుచునే యుండెను. కాని, ఇది అంతయూ ఒక కలగా యుండెను. ఏనాడున్నూ, కలలోగూడా అనుకోలేదు. తన కుమారు నకు ఇంత భాగ్యము లభించునని ఏనా డున్నూ, కలలోగూడా అనుకోలేదు. ఏమి యున్నూ మాట్లాడలేక పోయెను. చివరకు ''సరే'' అనే ఒక్కమాట మాత్రమూ అనగల్గెను.

''రాముా చదువుయందు వృద్ధిలోనికి వచ్చుచున్నాడు. ఇంటరుమీడియేటు కా లేజీ ప్రథమముడుగా కృతార్థుడయినాడు. బి. యస్. సి. అందు ప్రవేశపెట్టాడు. అది కూడా మంచి మార్కులతో కృతార్థు డయినాడు. ప్రసాదరావుగార్కి కావలసి నంత ధనము ఏమయిననూ చెప్పించగలడు. రాముాను, కలకత్తా విశ్వవిద్యాలయము నకు పంపదలచెను. ధరఖాస్తు పెట్టించాడు.

రాముా కలకత్తా విద్యాభ్యాసముకై వెడలుచూ ముందుగా తల్లిగారికి, తర్వాత పెద్దవారగు ప్రసాదరావుగార్కి నమస్క రించెను. పాపం! శారదమ్మగారు కుమా రుని వదలి ఎన్నడునూ ఉండలేదు. కన్నీ టితో కుమారుని సాగనంపెను.

మూడు దినములు గడచినవి. నాల్గవ రోజు ఉదయమున ప్రసాదరావుగారు కాఫీ త్రాగుచూ కూర్చుండిరి. ఇంతలో రేడి యోయందు కలకత్తా మెయిలుకు ఘోర ప్రమాదము సంభవించిందని వార్తవచ్చెను. అందులో ఇరువది ఇద్దరి దుర్మరణం, మిగతవారికి గాయములు అనికూడా వెలు వడెను. ప్రసాదరావుగారు త్రాగుచున్న గ్లాసు దానంతట అది క్రిందపడి పగిలి పోయినది. ప్రసాదరావుగార్కి కాళ్ళు చేతులూ ఆడలేదు.

ఈ వార్త వినగానే శారదమ్మకు ఒకటే ఏడ్పు. మధ్యాహ్నం 12 గం॥ లాయెను. ఇంతలో టెలిగ్రాం వచ్చినది. అందులో ''రామారావు మరణం'' అని యున్నది.

ఈ వార్త వినుచునే శారదమ్మగార్కి మాటా పలుకూ లేకుండా పోయినది. ఇంకే ముంది. ఆ మహాతల్లి కుమారుని వదలి ఉండలేదాయెను! తనుకూడా ఈలోకం వదలివేసి కుమారుని వద్దకే ప్రయాణమయి పోయినది. అప్పుడే రేడియోనందు ''గాలి మేడలూ, గారడికాగా'' అనే ఘంటసాల వారు పాడినపాట వినవచ్చుచుండెను.